
ఆంధ్రజ్యోతి
andhrajyothy.com సోమవారం ఉష్ణోగ్రత గరిష్ఠం 33.3 ; కనిష్ఠం 23.2



చలో చేవెళ్ల

- నేడు రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా భారీ బహిరంగ సభ
- మరో రెండు గ్యారెంటీ పథకాలకు శ్రీకారం చుట్టనున్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి
- జిల్లా నుంచి తరలివెళ్లనున్న 10 ఆర్టీసీ బస్సులు
- మహిళా సంఘాల సభ్యులను తరలించేందుకు ఏర్పాట్లు
- పర్యవేక్షణకు ప్రత్యేకాధికారులు, సిబ్బంది నియామకం
- సర్వం సిద్ధం చేసిన జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ అధికారులు



ఆదిలాబాద్, ఫిబ్రవరి 26(ఆంధ్రజ్యోతి): ఎన్నికల హామీలలో భాగంగా ఇప్పటికే రెండు హామీలను అమలు చేస్తున్న రాష్ట్ర ప్రభుత్వం.. మళ్లీ ఓ అడుగు ముందుకేసి మంగళవారం మరో రెండు గ్యారెంటీ పథకాలకు శ్రీకారం చుట్టేందుకు సిద్ధమైంది. చేవేళ్ల వేదికగా గృహజ్యోతి, 200 యూనిట్ల లోపు ఉచిత విద్యుత్ పథకాలను ప్రారంభించేందుకు ఏర్పాట్లను పూర్తి చేసింది. ప్రభుత్వం అధికారికంగా నిర్వహిస్తున్న ఈ సభను విజయవంతం చేసేందుకు డీఆర్డీఏ అధికారులకు ప్రత్యేక బాధ్యతలను అప్పగించింది. దీంతో చలో చేవేళ్ల పేరిట జిల్లా నుంచి మహిళలను తరలించేందుకు అధికారులు ఏర్పాట్లను పూర్తి చేశారు. జిల్లాలో ఆదిలాబాద్, బోథ్ నియోజకవర్గాలు పూర్తిస్థాయిలో ఉండగా.. ఖానాపూర్, ఆసిఫాబాద్ నియోజకవర్గాలు పాక్షికంగా కొనసాగుతున్నాయి. ప్రభుత్వ ఆదేశాల ప్రకారం ప్రతీ నియోజకవర్గం నుంచి డ్వాక్రా మహిళలను తరలించేందు కు నాలుగు ఆర్టీసీ బస్సులను ఏర్పాటు చేశారు. ఆదిలాబాద్ నియోజక వర్గం నుంచి 4, బోథ్ 4, ఖానాపూర్ 1, ఆసిఫాబాద్ 1 మొత్తం 10 ఆర్టీసీ బస్సులను రిజర్వుడు చేశారు. మంగళవారం ఉదయం 5గంటలకు బయలుదేరి వెళ్లి రంగారెడ్డి జిల్లా చేవేళ్లకు మధ్యాహ్నం 2గంటలకు చేరు కుంటారు. బహిరంగ సభ పూర్తయిన తర్వాత తిరిగి రాత్రి వరకు జిల్లాకు చేరుకుంటారు. ప్రభుత్వం నిర్వహించే భారీ బహిరంగ సభకు మహిళలను తరలించేందుకు గ్రామీణాభివృద్ధి శాఖ అధికారులు ఏర్పాట్లను పూర్తి చేసింది.

సభకు మహిళల తరలింపు


చేవేళ్ల బహిరంగ సభకు జిల్లా నుంచి 500 మంది మహిళ సంఘాల సభ్యులను తరలించేందుకు అధికారులు ఏర్పాట్లను పూర్తి చేశారు. ఇప్పటికే 10 ఆర్టీసీ బస్సులను రిజర్వేషన్ చేసి అధికారులు సిద్ధం చేశారు. మంగళవారం ఉదయం నిర్ణయించిన ప్రాంతాల్లో ఆర్టీసీ బస్సులను అందుబాటులో ఉంచుతారు. ఒక్కో బస్సులో 50 మంది మహిళల చొప్పున మొత్తం 500 మంది మహిళలు తరలి వెళ్లనున్నారు. ఆదిలాబాద్ జిల్లా కేంద్రం నుంచి 4, అలాగే బోథ్ నియోజక వర్గ కేంద్రం 4, ఉట్నూర్ మండలకేంద్రం నుంచి 2 బస్సులు బయలుదేరి వెళ్లనున్నాయి. ఉదయం 5 గంటలకు బస్సులు బయలుదేరే ప్రాంతాలకు మహిళ సంఘాల సభ్యులు చేరుకునేలా ఏర్పాట్లను చేశారు. ఇప్పటికే క్షేత్రస్థాయి సిబ్బంది మహిళ సంఘాలతో ప్రత్యేకంగా సమావేశమై చేవేళ్ల బహిరంగ సభకు తరలిరావాలని సూచించారు.

రవాణా, భోజన వసతి ఉచితం

బహిరంగ సభకు తరలివెళ్లే మహిళ సంఘాల సభ్యులకు రవాణా సౌకర్యంతో పాటు భోజన వసతిని అధికారులే ఉచితంగా కల్పిస్తారు. ఉదయం టిఫిన్, మధ్యాహ్నం భోజనం, రాత్రి మళ్లీ భోజన వసతిని ఏర్పాటు చేశారు. బస్సులో మంచి నీటి సౌకర్యాన్ని కూడా కల్పించారు. అలాగే మహిళలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ప్రత్యేక అధికారులను నియమించారు. ఒక్కో బస్సుకు 50 మంది మహిళలతో పాటు ఏపీఎం, సీసీ, కానిస్టేబుల్, ఏఎన్ఎం, అటెండర్, సిబ్బందిని నియమించారు. సభకు మహిళల తరలింపు, ఇతర వసతులను డీఆర్డీఏ పీడీ పర్యవేక్షిస్తున్నారు. నియోజక వర్గ కేంద్రాల నుంచే మహిళలను భారీ బహిరంగ సభకు తరలించే విధంగా ఏర్పాట్లు చేస్తున్నారు. ఇతర మండలాల నుంచి వచ్చే మహిళలకు ఇబ్బందులు కలుగకుండా సిబ్బందిని అప్రమత్తం చేస్తున్నారు. బహిరంగ సభను ముగించుకుని తిరిగి వచ్చేసరికి రాత్రి అయ్యే అవకాశం ఉండడంతో ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా ముందు జాగ్రత్తలు తీసుకుంటున్నారు.







ఏర్పాట్లను పూర్తి చేశాం

: సాయన్న, డీఆర్డీఏ పీడీ, ఆదిలాబాద్

ప్రభుత్వ ఆదేశాల మేరకు చేవేళ్ల బహిరంగ సభకు జిల్లా నుంచి మహిళలను తరలించేందుకు ఏర్పాట్లను పూర్తి చేశాం. 10 ఆర్టీసీ బస్సుల్లో మొత్తం 500 మంది మహిళా సంఘాల సభ్యులను తరలిస్తాం. దీనికి అవసరమైన అన్నిరకాల ఏర్పాట్లను చేశాం. ఉదయం టిఫిన్‌తో పాటు మధ్యాహ్నం, రాత్రి భోజన వసతిని కల్పించాం. ప్రతీ బస్సుకు ఇన్‌చార్జీ అధికారులను నియమించాం. ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా జాగ్రత్త చర్యలు చేపడుతున్నాం.



ఐటీడీఏ సమావేశ మందిరంలో అర్జీలు స్వీకరిస్తున్న అధికారులు

గిరిజనుల సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలి : ఏపీవో జనరల్

ఉట్నూర్, ఫిబ్రవరి 26: గిరిజన ప్రజల సమస్యల పరిష్కారానికి చర్యలు ఎప్పటికప్పుడు తీసుకుంటున్నామని ఏపీఓ జనరల్ కినక భీంరావు, డీడీ దిలీప్‌కుమార్‌లు అన్నారు. సోమవారం ఉట్నూర్ మండల కేంద్రంలోని ఐటీడీఏ కార్యాలయ సమావేశ మందిరంలో నిర్వహించిన గిరిజన దర్బార్‌లో వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన గిరిజనులు తమ సమస్యలను పరిష్కరించాలంటూ అర్జీలను అందజేశారు. దీనిలో భాగంగా పించన్లు, రెండు పడక గదుల ఇళ్లు, స్వయం ఉపాధి పథకాల మంజూరు, వ్యవసాయ రెవెన్యూ శాఖలకు సంబంధించిన సమస్యలు పరిష్కరించాలంటూ ప్రజలు దరఖాస్తులు సమర్పించారు. సమస్యల పరిష్కారానికి సంబంధిత శాఖల అధికారులు వెంటనే చర్యలు తీసుకోవాలని వారు సంబంధిత అధికారులకు సూచించారు. ఇందులో ఏడీఎంహెచ్‌వో కుమ్రం బాలు, ఏవో సున్నం రాంబాబు, ఏపీవో పీవీటీజీ ఆత్రం భాస్కర్, పీహెచ్‌వో సందీప్, జేడీఎం నాగభూషణం, ప్రిన్సిపాల్ మెస్రం మనోహర్, డీపీవో ప్రవీణ్, తదితరులు పాల్గొన్నారు.

యూరియా కొరత లేకుండా చూడాలి

- జిల్లా వ్యవసాయ అధికారి పుల్లయ్య

తలమడుగు, ఫిబ్రవరి 26: జిల్లాలో రబీ పంటలు సాగు చేస్తున్న రైతులకు యూరియా కొరత లేకుండా చూడాలని జిల్లా వ్యవసాయ అధికారి పుల్లయ్య అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘ కార్యాలయాన్ని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో సహకార సంఘాలు, వివిధ ఎరువుల షాపుల ద్వారా విక్రయిస్తున్న యూరియా, ఇతర ఎరువుల కొరత లేకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని సూచించారు. అంతేకాకుండా రైతులు యూరియా కొనుగోలు సమయంలో ఆధార్‌కార్డు తప్పనిసరి తీసుకు రావాలని, రైతులకు ఎక్కువ ధరకు విక్రయించొద్దని స్పష్టం చేశారు. తలమడుగు సహకార సంఘం ద్వారా యాసంగి సీజన్‌లో రూ.4కోట్ల ఎరువులు విక్రయించడం అభినందనీయమని అన్నారు. అనంతరం సహకార సంఘం జిల్లా అధికారి మోహన్ మాట్లాడుతూ సహకార సంఘాల ద్వారా రుణాలను అందించడమే కాకుండా ఆర్థిక భారం తగ్గించేందుకు ఎరువుల విక్రయాలు పంటల కొనుగోలు చేపడుతున్నామన్నారు. అనంతరం సహకార సంఘాల సంబంధించిన గోదాంను తనిఖీ చేసి వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఇందులో మండల వ్యవసాయ అధికారి మహేందర్, సీఈవో శ్రీనివాస్, సెక్రెటరీలు సాగర్, గంగయ్య, భీమ్‌రావు, సిబ్బంది, తదితరులున్నారు.

'కేంద్రం నిధులతోనే అభివృద్ధి పనులు'

తలమడుగు, ఫిబ్రవరి26: కేంద్ర ప్రభుత్వం అందించే నిధులతోనే రాష్ట్రంలో అభివృద్ధి పనులు జరుగుతున్నాయని ఎంపీ సోయం బాపురావు అన్నారు. సోమవారం మండలంలోని నందిగామ గ్రామంలో జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద మంజూరైన రూ.10 లక్షల నిధులతో సీసీ రోడ్ల నిర్మాణానికి భూమిపూజ చేశారు. అనంతరం ఎంపీ మాట్లాడుతూ గ్రామాల అభివృద్ధి కోసం కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక నిధులను కేటాయించిందన్నారు. ఉమ్మడి ఆదిలాబాద్‌కు ఎంపీ రికమండ్‌తో రూ.9కోట్ల నిధులు మంజూరయ్యాయన్నారు. ఇందులో జడ్పీటీసీ గోక గణేష్‌రెడ్డి, ఎంపీపీ కళ్యాణం లక్ష్మీరాజేశ్వర్, నాయకులు జీవి రమణ, ప్రకాష్‌రావు, మాధవరావు, ప్రతాప్, శ్రీనివాస్, నారాయణరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

అవయవ దానంపై అవగాహన

మావల, ఫిబ్రవరి 26: అవయవదానంపై బుధవారం స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జంతుశాస్త్ర విభాగం ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం ఉంటుందని ప్రిన్సిపాల్ డా.ఏ.శ్రీనివాస్, జంతుశాస్త్రం విభాగం అధిపతి జె.విజయ్‌కుమార్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. నేషనల్ సైన్స్‌డేను పురస్కరించు కొని కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమానికి రిమ్స్ ఆదిలాబాద్‌లో అసిస్టెంట్ ప్రొఫె సర్‌గా పనిచేస్తున్న డా.జె.సురేష్ జనరల్ సర్జన్ ప్రధాన వక్తగా విచ్చేయనున్నారని ఆయన తెలిపారు.

ఎస్సీ స్టడీ సర్కిల్‌లో ఉచిత శిక్షణ

ఆదిలాబాద్ అర్బన్, ఫిబ్రవరి 26: ఎస్సీ స్టడి సర్కిల్ ఆధ్వర్యంలో 5 నెలల పాటు ఉచిత రెసిడెన్షియల్ శిక్షణ ఇవ్వనున్నట్లు జిల్లా ఎస్సీ అభివృద్ధి శాఖ అధికారి సునితకుమారి, ఎస్సీ స్టడి సర్కిల్ డైరెక్టర్ డా.రమేష్ ఒక ప్రకటనలో తెలిపారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని (నిర్మల్, మంచిర్యాల, కుమురంభీం, ఆదిలాబాద్) డిగ్రీపాసైన ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ నిరుద్యోగ యువతీ, యువకులు ఈనెల 26 నుంచి మార్చి 6 వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఈ 5 నెలల ఫౌండేషన్ కోర్సులో భాగంగా గ్రూపు 2, 3, 4, పోలీసు కానిస్టేబుల్, ఇతర అన్ని ఉద్యోగాల కోసం శిక్షణ ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. శిక్షణ సమయంలో 12 నోట్ బుక్‌లు, రూ.2500 పుస్తకాలు, కాస్మోటిక్ చార్జీలు ఇవ్వనున్నట్లు తెలిపారు. కేంద్ర స్థాయి ఉద్యోగాలు అయిన ఎస్ఎస్‌సీ, ఆర్ఆర్‌బీ, బ్యాంకింగ్‌లకు కూడా ప్రత్యేక శిక్షణ ఇస్తున్నట్లు, ఈ 5నెలల ఉచిత రెసిడెన్షియల్ శిక్షణ కోసం జరిగే పరీక్ష మార్చి 10 ఉదయం 11గంటల నుంచి మధ్యాహ్నం 1గంట వరకు కొనసాగుతుందన్నారు. ఇతర వివరాలకు ఫోన్ నెం. 9398784343, 9494149416, 9000967211ల ద్వారా సంప్రదించాలన్నారు.

ఎస్టీ స్టడీ సర్కిల్ ఏర్పాటు చేయాలి

నేరడిగొండ, ఫిబ్రవరి 26: జిల్లాకేంద్రంలో కలెక్టర్ గ్రీవెన్స్ హాల్‌లో సోమవారం కలెక్టర్ రాహుల్‌రాజ్‌ను ఆదివాసీ గిరిజన విద్యార్థి సంఘం ఏఎస్‌యూ జిల్లా కార్యదర్శి, సలాం వరుణ్ నేరడిగొండ మండల అధ్యక్షుడు రాథోడ్‌సందీప్‌లు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆదివాసీ గిరిజన విద్యార్థి సంఘాల నేతలు సలాం వరుణ్, రాథోడ్ సందీప్ మాట్లాడుతూ జిల్లాలో ఎస్సీ, బీసీ స్టడీ సర్కిల్ ఉన్నాయని, కేవలం గిరిజన విద్యార్థులకు మాత్రం లేదని అన్నారు. గతంలో ఈ విషయాన్ని రాజకీయ నేతలకు ప్రజాప్రతినిధులకు జిల్లా అధికారులకు వినతిపత్రాలు ఇచ్చిన ఫలితం లేదన్నారు. ఆర్థికంగా వెనుకబడిన ప్రాంతాల ఆదివాసీ గిరిజన విద్యార్థి నిరుద్యోగులకు స్టడీ సర్కిల్ లేక పోటీ పరీక్షలకు ప్రిపేర్ కావడం లేదని, ప్రైవేట్ సడీ సెంటర్లలో వేల రూపాయలు పెట్ట లేకపోవడంతో కూలీలుగా జీవనం సాగిస్తున్నారని అన్నారు. నూతనంగా ఎన్నికైన ప్రభుత్వం ఎస్టీ స్టడీ సెంటర్ ఏర్పాటు చేసి న్యాయం చేయాలని, లేనిపక్షంలో పెద్దఎత్తున ఆందోళన చేస్తామని స్పష్టం చేశారు. ఇందులో గోపాల్, నారిష్, లోకేష్, సునీల్, కేశవ్, హరీష్, శంకర్, తదితరులున్నారు.

'నిధులు మంజూరు చేయండి'

ఆదిలాబాద్ అర్బన్, ఫిబ్రవరి 26: ఆదిలాబాద్-ఆర్మూర్ రైల్వేలైన్‌కు నిధులు మంజూరు చేసి నిర్మాణం పనులు ప్రారంభించాలని డిమాండ్ చేస్తూ జిల్లా కేంద్రంలో ప్రారంభించిన రిలేనిరాహార దీక్షలు సోమవారంతో 42వ రోజుకు చేరాయి. ఈ దీక్షల్లో కాంగ్రెస్ పార్టీ పార్లమెంట్ నియోజకవర్గ సమన్వయకర్త శ్రావణ్ నాయక్ పాల్గొని మద్దతు ప్రకటించారు. సభ్యులు మాట్లాడుతూ కేంద్రం నిధులు మంజూరు చేసి పనులు ప్రారంభించే వరకు ఉద్యమాన్ని కొనసాగిస్తామన్నారు.

పల్స్ పోలియోను జయప్రదం చేయాలి

- జిల్లా టాస్క్‌ఫోర్స్ సమన్వయ కమిటీ సమావేశంలో కలెక్టర్ రాహుల్‌రాజ్
- 'ప్రజా ఫిర్యాదుల విభాగాని'కి తరలివచ్చిన అర్జిదారులు

ఆదిలాబాద్ అర్బన్, ఫిబ్రవరి 26: పల్స్ పోలియో కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని జిల్లా కలెక్టర్ రాహుల్‌రాజ్ తెలిపారు. సోమవారం పల్స్ పోలియో కార్యక్రమంపై జిల్లా టాస్క్‌ఫోర్స్ సమన్వయ కమిటీ సమావేశాన్ని కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ మార్చి 3 నుంచి మూడు రోజుల పాటు అప్పుడే పుట్టిన చిన్నారుల నుంచి ఐదేళ్లలోపు పిల్లలకు దేశవ్యాప్తంగా పోలియో చుక్కలు వేయడం జరుగుతుందన్నారు. ఈ సందర్భంగా జిల్లాలో 0-5 పిల్లలు ప్రతి ఒక్కరికి పల్స్ పోలియో చుక్కలు వేసేలా ముఖ్యంగా స్లమ్ ఏరియాలో ప్రత్యేక కార్యక్రమాలు చేపట్టి అవగాహన కల్పించాలని అధికారులను ఆదేశించారు. గ్రామాల్లో, వార్డులలో టాంటాం వేయించి అర్హులైన పిల్లలను గుర్తించి మార్చి 3న అందరుపల్స్ పోలియో చుక్కలు వేసుకునేలా చర్యలు చేపట్టాలని సూచించారు. మార్చి 3న నిర్వహించనున్న పల్స్ పోలియో కార్యక్రమంలో సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో విధులు నిర్వహించాలని, అప్పుడే పుట్టిన బిడ్డ నుంచి 5 సంవత్సరాల పిల్లలందరికీ పోలియో చుక్కలు వేయించాలన్నారు. జిల్లాలో 5 సంవత్సరాల లోపు చిన్నారులు 77,155 మంది ఉన్నారని తెలిపారు. అర్బన్ ఏరియాలో 81, రూరల్ ఏరియాలో 420, ట్రైబల్ ఏరియాలో 301 మొత్తం 802 పోలియో కేంద్రాలను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. కార్యక్రమానికి విస్తృత ప్రచారం నిర్వహించాలని బస్టాండ్, రైల్వే స్టేషన్లు, పట్టణ ముఖ్య కూడళ్లలో కేంద్రాలు ఏర్పాటు చేయాలని సూచించారు. ఆశా, ఏఎన్ఎం, అంగన్‌వాడీ సిబ్బంది, మహిళ సంఘాలు, సంబంధిత శాఖల అధికారులు కార్యక్రమం నిర్వహణలో చురుగ్గా పాల్గొనాలని ఆదేశించారు. మారుమూల ప్రాంతాలు, సంచార జాతులు, ఇటుకబట్టిలు, నిర్మాణ స్థలాలలోని చిన్నారులకు తప్పనిసరిగా పోలియో చుక్కలు వేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. 3న పల్స్ పోలియో చుక్కలు కార్యక్రమం అనంతరం మరునటి రోజు 4,5 తేదీలలో రెండు రోజులు ఇంటింటి సర్వే నిర్వహించి పోలియో చుక్కలు వేసుకోని మిగిలిన వారికి పల్స్ పోలియో చుక్కలు వేయాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమాన్ని పకడ్బందీగా నిర్వహించి విజయవంతం చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో జిల్లా వైద్యాధికారి డా.నరేందర్ రాథోడ్, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

26 నుంచి ఆర్థిక అక్షరాస్యత వారోత్సవాలు

ఆదిలాబాద్ అర్బన్: ఈనెల 26 నుంచి మార్చి 31 వరకు రిజర్వ్ బ్యాంక్ ఇండియా ఆధ్వర్యంలో ఆర్థిక అక్షరాస్యత వారోత్సవాలను నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ రాహుల్‌రాజ్ తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ బ్యాంకులు, విద్యా సంస్థలు ఈ కార్యక్రమంలో పాల్గొంటున్నాయన్నారు. మంగళవారం జిల్లాకేంద్రంలోని ఇందిరా ప్రియదర్శిని స్టేడియంలో ఉదయం 7 గంటలకు జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలో 2కే రన్ నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి జిల్లా అధికారులు, బ్యాంకర్లు హాజరు కావాలని లీడ్ బ్యాంక్ మేనేజర్ కె.భాస్కర్ తెలిపారు ఈ నెల 28న ఉదయం 11గంటలకు ఆర్థిక అక్షరాస్యత శిబిరం మున్సిపల్ కార్యాలయం ఎదుట ఉన్న డిగ్రీ కళాశాలలో నిర్వహించడం జరుగుతుందన్నారు. అనంతరం కలెక్టర్ ఎల్‌డీఎం, ఇతర అధికారులతో కలిసి పోస్టర్, పుస్తకాలను ఆవిష్కరించారు. ఇందులో అధికారులు, తదితరులు పాల్గొన్నారు.



అర్జీదారుల నుంచి ఫిర్యాదులను స్వీకరిస్తున్న కలెక్టర్ రాహుల్‌రాజ్

అర్జీలు పెండింగ్ లేకుండా చర్యలు తీసుకోవాలి

ఆదిలాబాద్ అర్బన్: ప్రజాఫిర్యాదుల విభాగంలో వచ్చే అర్జీలను పెండింగ్‌లో లేకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ రాహుల్‌రాజ్ అన్నారు. సోమవారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజాఫిర్యాదుల విభాగంలో ఫిర్యాదులు దారుల నుంచి అర్జీలను స్వీకరించారు. అంతకు ముందు ఆయా శాఖ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా లీడ్ బ్యాంకు మేనేజర్ భాస్కర్‌ప్రసాద్‌తో కలిసి ఆర్‌బీఐ స్కీంల కరపత్రాలు, పోస్టర్లను విడుదల చేశారు. అనంతరం కలెక్టర్ రాహుల్‌రాజ్ మాట్లాడుతూ ప్రజా ఫిర్యాదుల విభాగంలో వచ్చే అర్జీలను ఎప్పటికప్పుడు పరిష్కరిస్తూ పెండింగ్‌లో లేకుండా అధికారులు కృషి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డీఆర్‌వో రాథోడ్‌రమేష్, ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.

'ఆదివాసీ సంస్కృతిని భావితరాలకు అందించాలి'

ఇంద్రవెల్లి, ఫిబ్రవరి 26: దేశంలో ఆదివాసీ సంస్కృతి, సంప్రదాయాలు ఎంతో గొప్పవని, వాటిని భావితరాలకు పదిలంగా అందించాలని ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ అన్నారు. సోమవారం స్థానిక వ్యవసాయ మార్కెట్ యార్డులో గోండి ధర్మ గురు హీరాసుక్క జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ముందుగా స్థానిక ప్రధాన్ గూడలో ఆదివాసీ సంప్రదాయ వాయిద్యాలు వాయిస్తూ జెండాను ఆవిష్కరించి హీరాసుక్క చిత్రపటానికి ప్రత్యేక పూజలు చేశారు. ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే బొజ్జు హీరాసుక్క చిత్రపటానికి పూలమాలలు వేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కొన్ని సంఘ విద్రోహ శక్తులు ఆదివాసీల సంస్కృతి, సంప్రదాయాలను దెబ్బతీసే కుట్ర పన్నుతున్నాయని, దాన్ని పసిగట్టి తిప్పి కొట్టాలన్నారు. తరతరాలుగా పాలిస్తూ వస్తున్న ఆచార వ్యవహారాలను తూ.చా. తప్పకుండా పాటించాలన్నారు. ఆర్ఎస్ఎస్ ఆదివాసీల సంస్కృతి, సంప్రదాయాలను విచ్ఛిన్నం చేసే కుట్ర చేస్తోందని, దాన్ని తిప్పికొట్టాల్సిన బాధ్యత మనపై ఎంతైనా ఉందన్నారు. కార్యక్రమంలో శిక్షణ కలెక్టర్ వికాస్ మహతో, ఉత్సవ కమిటీ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు దుర్వ నగేష్, పూసం ఆనంద్‌రావు, ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మెస్రం మనోహర్, జిల్లా అధ్యక్షుడు మడావి శంకర్, సిడాం రాంకిషన్, కోడప నగేష్, కుర్సేంగే తానాజీ, మడావి లక్ష్మణ్, శేషనారాయణ, యాదవ్‌రావ్, ఆత్రం భాస్కర్, ఆత్రం సుగుణ, తదితరులు పాల్గొన్నారు.

'ప్రత్యేక నిధులతో మౌలిక సదుపాయాల కల్పన'

మావల, ఫిబ్రవరి 26: కేంద్రంలోని నరేంద్రమోదీ ప్రభుత్వం ప్రత్యేక నిధులతో గ్రామాల్లో మౌలిక సదుపాయాలను కల్పించడం జరుగుతుందని ఎమ్మెల్యే పాయల శంకర్ అన్నారు. సోమవారం ఆదిలాబాద్ మండలంలోని చాందా, పొచ్చెర గ్రామాల్లో సీసీ రోడ్లు, మురికి కాలువల నిర్మాణ పనులకు భూమిపూజ చేసి పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వంలో పాలకులు తమకు ఓట్లు రాని గ్రామాలను, ప్రాంతాలను నిర్లక్ష్యం చేస్తూ వారిపై కక్ష సాధింపు చర్యలుగా అభివృద్ధి పనులు అన్నింటినీ నిలిపివేసిన ఆచారం ఉండేదన్నారు. కానీ అలాకాదని, ఎమ్మెల్యే మొత్తం నియోజకవర్గానికి ప్రతినిధిగా ఉంటూ అభివృద్ధి పనులు చేపట్టాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో శ్రీనివాస్, భూమన్న, దత్తు, శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

'మెరుగైన విద్య అందించడానికి ఎల్లవేళలా కృషి'

నేరడిగొండ, ఫిబ్రవరి 26: బోథ్ నియోజకవర్గ విద్యార్థులకు మెరుగైన విద్య అందించడానికి ఎల్లవేళలా కృషి చేస్తానని ఎమ్మెల్యే అనిల్‌జాదవ్ అన్నారు. సోమవారం నేరడిగొండ మండలంలోని బుగ్గారాం(బి) గ్రామంలో ఉన్న తెలంగాణ ట్రైబల్ వెల్ఫేర్ బాలికల గురుకుల కళాశాలలో రూ.5కోట్లతో నూతన అదనపు తరగతి గదులను నిర్మాణానికి భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ విద్యార్థులు చదువుతోనే ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని అన్నారు. అంతకుముందు బుగ్గారాం గ్రామ పెద్ద లచ్చునాయక్ ఇటీవల మృతి చెందగా వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఆయన వెంట ఎంపీపీ రాథోడ్ సజన, ఐటీడీఏ ఏఈ సుధాకర్, ప్రిన్సిపాల్ కృష్ణవేణి, నాయకులు దేవేందర్ రెడ్డి, జాదవ్ వసంత్‌రావు, రాందాస్, కృష్ణనాయక్, గ్రామపెద్దలు, తదితరులున్నారు.



వైభవంగా ఎడ్‌బిడ్ మల్లన్న జాతర

● భారీగా తరలివచ్చిన భక్తజనం ● అలరించిన ఉత్సవాలు ● కుస్తీ పోటీల్లో పాల్గొన్న మల్ల యోధులు



కుస్తీ పోటీలు తిలకిస్తున్న భక్తులు



విజేతకు వెండి కడియం బహూకరిస్తున్న నిర్వాహకులు

ముథోల్, ఫిబ్రవరి 26 : నిర్మల్ జిల్లా ముథోల్ మండలంలోని ఎడ్‌బిడ్ గ్రామంలో గల మల్లన్న దేవుని జాతర సోమవారం అంగరంగ వైభవంగా జరిగింది. ఆదిలాబాద్, మంచిర్యాల, నిజామాబాద్, కామారెడ్డి, మహారాష్ట్ర నుండి సైతం భారీ సంఖ్యలో భక్తులు తరలివచ్చి మల్లన్న దేవుడిని దర్శించుకున్నారు. కోరిన కోరికలను తీర్చాలని నిలువెత్తు బంగారాన్ని (బెల్లం) సమర్పించారు. మొక్కిన మొక్కులు ఫలించడంతో కొందరు భక్తులు ఆలయంలో సామూహిక సత్యనారాయణ వ్రతాన్ని నిర్వహించారు. కోరిన కోరికలు నెరవేర్చే ఇలవేల్పుగా ఇక్కడి ప్రాంత ప్రజల నమ్మకం. ఈ జాతర సందర్భంగా సుమారు 25 వేలకు పైగా భక్తులు తరలివచ్చి మల్లన్న దేవుడిని దర్శించుకున్నారు. ఆలయం పరిసరాలు భక్తులతో కిటకిటలాడాయి.

కుస్తీ పోటీలకు తరలివచ్చిన మల్లయోధులు

జాతరలో భాగంగా సోమవారం ఆలయ కమిటీ, గ్రామస్థుల ఆధ్వర్యంలో సుమారు లక్ష రూపాయలతో జాతరలో కుస్తీ పోటీలు నిర్వహించారు. తెలంగాణ నుండే కాకుండా మహారాష్ట్ర నుండి సైతం మల్లయోధులు తరలివచ్చి కుస్తీ పోటీల్లో పాల్గొన్నారు. కుస్తీ పోటీల్లో ఫైనల్ పోటీల్లో భవనాన్, లింగరాజ్ అనే ఇద్దరు మల్లయోధులు తలపడగా మహారాష్ట్రకు చెందిన కోలాపూర్ గ్రామవాసి లింగరాజ్ గెలుపొందాడు. ఈ సందర్భంగా జాతరకు వచ్చిన భక్తులకు నిర్వాహకులు సుమారు 25 క్వింటాళ్ల బియ్యంతో అన్న దానం నిర్వహించారు. అక్షర మల్టీ స్పెషాలిటీ ఆసుపత్రి ఆధ్వర్యంలో ఉచిత హెల్త్ క్యాంపు నిర్వహించి భక్తులకు మందులను అందజేశారు. ముథోల్ సీఐ మల్లేష్ ఆధ్వర్యంలో ఎస్సై సాయికిరణ్, పోలీసు సిబ్బంది గట్టి బందోబస్తు చేపట్టారు. జాతరకు భైంసా నుండి ప్రత్యేక ఆర్టీసీ బస్సులు నడిచాయి.

పోటీలను ముథోల్ ఎమ్మెల్యే పవర్ రామారావు పటేల్ తిలకించారు. గెలుపొందిన మల్లయోధులకు నగదు బహుమతి అందించారు. మండల ఉపాధ్యక్షులు లావణ్య రవీందర్‌రెడ్డి, తాజా మాజీ సర్పంచ్ స్వర్ణలత దత్తు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

పాత పద్ధతిలోనే ప్రమోషన్లు కల్పించాలి

● యూనియన్ రాష్ట్ర అధ్యక్షురాలు సునీత
● కలెక్టరేట్ ఎదుటు అంగన్‌వాడీల ధర్నా

ఆదిలాబాద్ అర్బన్, ఫిబ్రవరి 26: అంగన్‌వాడీ హెల్పర్లకు పాత పద్ధతిలోనే ప్రమోషన్ కల్పించాలని సీఐటీయూ అనుబంధ తెలంగాణ అంగన్‌వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షురాలు సునిత డిమాండ్ చేశారు. సోమవారం సంఘం ఆధ్వర్యంలో కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ప్రభుత్వం నూతనంగా చేపట్టే నియమకాల్లో ఆయాలకు మొదటి ప్రాధాన్యత ఇవ్వాలని నినాదాలు చేశారు. ఐసీడీఎస్‌లో 9వేల ఖాళీలను భర్తీ చేయడానికి ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేయడం హర్షనీయమని, కానీ ఇందులో ఆయాలకు మొదటి ప్రాధాన్యత ఇవ్వాలని అంగన్‌వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షురాలు సునిత కోరారు. హెల్పర్ల ప్రమోషన్‌లో విద్యార్హల ఎస్ఎస్‌సీ ఉంటే దాన్ని ఇంటర్ మార్చారన్నారు. దీని వల్ల అనేక సంవత్సరాల తర్వాత పోస్టుల భర్తీలో వచ్చే ప్రమోషన్ సౌకర్యానికి అనేక మంది హెల్పర్లు దూరమయ్యే ప్రమాదం ఉందన్నారు. ప్రభుత్వం తన నిర్ణయాన్ని ఉప సంహరించుకుంటు పాత పద్ధతిలోనే ప్రమోషన్ సౌకర్యం కల్పించాలని కోరారు. లేని పక్షంలో ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఇందులో సీఐటీయూ అధ్యక్షుడు ఆశణ్ణ, ఉపాధ్యక్షుడు లింగాల చిన్నన్న, యూనియన్ నాయకురాలు గంగమ్మ, లక్ష్మి, ప్రియాంక, తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

ఇచ్చోడ, ఫిబ్రవరి 26: బంధువుల పెళ్లిపత్రికలు పంచుతూ రోడ్డుపై విఘత జీవిగా మారిన సంఘటన ఇచ్చోడ మండలంలోని కోకస్‌మన్నూర్ ఎక్స్‌రోడ్డు సమీపంలో గల రాణీ జిన్నింగ్ వద్ద సోమవారం చోటుచేసుకుంది. ద్విచక్ర వాహనాన్ని వెనుక నుంచి గుర్తుతెలియని వాహనం ఢీ కొట్టడంతో ద్విచక్రవాహనంపై ప్రయాణిస్తున్న యువకుడికి తీవ్రగాయాలై అక్కడికక్కడే మృతిచెందాడు. పోలీసుల వివరాల ప్రకారం.. మహారాష్ట్రలోని జీవతి తాలూకాకు చెందిన ఉమాజీ ఉత్తమ్ జాదవ్(33) అనే యువకుడు వారి బంధువుల పెళ్లిపత్రికలు పంచుకుంటూ సారంగాపూర్ మండలం నుంచి తన స్వగ్రామానికి వెళ్లే క్రమంలో ఇచ్చోడ సమీపంలోని 44వ జాతీయ రహదారిపై గుర్తుతెలియని వాహనం వెనుక నుంచి ఢీకొట్టగా ఉత్తమ్ జాదవ్ అక్కడికక్కడే మృతిచెందాడు. ఢీకొట్టిన సమయంలో అక్కడ ఎవరూ లేకపోవడంతో సదరు వాహనంతో సహ డ్రైవర్ అక్కడి నుంచి పరారయ్యాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తును కొనసాగిస్తున్నట్లు ఎస్సై నరేష్ పేర్కొన్నారు. ఢీకొట్టిన వాహనాన్ని వెతికేందుకు పోలీసు ప్రత్యేక బృందాలు గాలిస్తున్నట్లు ఆయన తెలిపారు. మృతుడు మరణించిన స్థలంలో డబ్బులు, పెళ్లిపత్రికలు ఇష్టారీతిన పడిఉన్నాయి. ఉత్తమ్ ప్రయాణిస్తున్న మహారాష్ట్రకు చెందిన పల్సర్ బైక్ వెనుకభాగం మొత్తం నుజ్జునుజ్జు కావడంతో మరో వాహనం వెనుక నుంచి ఢీకొట్టిన తెలుస్తుందని ఆయన పేర్కొన్నారు.

హత్య కేసులో ఒకరి జీవితఖైదు


ఆదిలాబాద్, ఫిబ్రవరి 26(ఆంధ్రజ్యోతి): హత్య కేసులో ఒకరికి జీవిత ఖైదు రూ.2వేల జరిమానా శిక్ష విధిస్తూ జిల్లా న్యాయాధికారి సీహెచ్‌వీ ఆర్ఆర్ వరప్రసాద్ తీర్పును వెల్లడించారు. వివరాల్లోకి వెళ్తే.. భీంపూర్ మండలం అర్లి(టి) గ్రామానికి చెందిన నేరస్థుడు కుమ్రబాబురావు, మృతుడు ఆత్రం అంకుశ్‌లు ఇద్దరు బంధువులు. మృతుడు ఆత్రం అంకుశ్ కుటుంబానికి అర్లి(టి) గ్రామ శివారులో వ్యవసాయ భూమి ఉంది. అయితే తనకు కౌలుకు ఇవ్వకుండా వేరే వ్యక్తికి ఇచ్చినందుకు నేరస్థుడు మృతుడితో గొడవ పడి జూలై 4న సాయంత్రం 7.30గంటలకు మృతుడితో ఘర్షణకు దిగాడు. దీంతో నేరస్థుడు తన ఇంటిలోని పదునైనా కత్తిని తీసుకుని మృతున్ని విచక్షణా రహితంగా పొడవడంతో మృతుడికి తీవ్రరక్త స్రావమై చనిపోయాడు. దీంతో నేరస్థుడు అక్కడి నుంచి పరారయ్యాడు. మృతుడి తండ్రి ఆత్రం రాంకిషన్ భీంపూర్ పోలీసు స్టేషన్‌లో ఇచ్చిన ఫిర్యాదు మేరకు అప్పటి ఎస్సై రాధిక కేసు నమోదు చేసుకుని సీఐ నరేష్‌కుమార్ నేర పరిశోధన జరిపి సెక్షన్ 302 ఐపీసీ కింద చార్జిషీటును దాఖలు చేశారు. ఇందులో 26 మంది సాక్ష్యులను విచారించి చార్జీషీటులో పొందుపర్చారు. కోర్టులో ప్రవేశ ఎట్టిన సాక్ష్యులు, సాక్ష్యాధారాల ఆధారంగా ఇరు పక్షాల వాదనలు విన్న జిల్లా ప్రధాన సెషన్ జడ్జి సీహెచ్‌వీ ఆర్ఆర్ వరప్రసాద్ నేరస్థుడిపై హత్యా నేరం రుజువైనందున సోమవారం తీర్పును వెల్లడిస్తూ శిక్షతో పాటు రూ.2వేల జరిమానా విధిస్తూ తీర్పును వెల్లడించారు. జరిమానా కట్టని పక్షంలో నేరస్థుడు అదనంగా మరో 6 నెలల సాధారణ శిక్ష అనుభవించాలని జిల్లా న్యాయాధికారి తీర్పునిచ్చారు.




















రేపటి నుంచి ఇంటర్ పరీక్షలు





పరీక్ష కేంద్రానికి చేరుకున్న జవాబు పత్రాలు, ఓఎంఆర్ షీట్లు

- 23 పరీక్ష కేంద్రాలకు చేరుకున్న ఓఎంఆర్ పత్రాలు
- పూర్తి కావచ్చిన హాల్‌టికెట్ల పంపిణీ
- జిల్లాలో పరీక్ష రాయనున్న 13,345 మంది విద్యార్థులు
- ఏర్పాట్లు పూర్తి చేసిన అధికారులు
- నిమిషం ఆలస్యమైనా అనుమతి లేదు : నోడల్ అధికారి

భైంసా, ఫిబ్రవరి 26 : జిల్లా ఇంటర్మీడియట్ విద్య అధికార యంత్రాంగం బుధవారం నుంచి ప్రారంభమయ్యే ఇంటర్ పరీక్షల కోసం ప్రణాళికా బద్ధమైన చర్యలు చేపట్టారు. ఇప్పటికే ప్రయోగ పరీక్షలు పూర్తి కాగా.. బుధవారం నుంచి వార్షిక పరీక్షలు నిర్వహించేందుకు గానూ అవసరమైన ఏర్పాట్లు చేపట్టారు. ఇప్పటికే జిల్లాలోని పరీక్ష కేంద్రాలకు జవాబు పత్రాలతో పాటు ఓఎంఆర్ షీట్లు చేరుకున్నాయి. విద్యార్థులకు హాల్‌టికెట్ల పంపిణీ పూర్తి కావచ్చింది. పరీక్ష కేంద్రాలు, నిర్వాహకుల నియామకాలు పూర్తయ్యాయి. పరీక్షలను పకడ్బందీగా నిర్వహించేందుకు గానూ జిల్లా నోడల్ అధికారి జాదవ్ పరుశురామ్ సోమవారం పరీక్ష నిర్వహణ అధికారులతో సమావేశం నిర్వహించి దిశానిర్దేశం చేశారు. జిల్లాలో 24 ప్రైవేటు కాలేజీలు, 11 ప్రభుత్వ జూనియర్ కళాశాలలు కలుపుకుని మొత్తం 35 జూనియర్ కళాశాలలున్నాయి. బుధవారం నుంచి ప్రారంభం కానున్న పరీక్షలలో మొదటి సంవత్సరం రెగ్యులర్ విద్యార్థులు 5463, ఒకేషనల్ విద్యార్థులు 1072, ద్వితీయ సంవత్సరం రెగ్యులర్ విద్యార్థులు 5,772, వోకేషనల్ విద్యార్థులు 1038 కలిపి మొత్తం 13,345 మంది విద్యార్థులు వార్షిక పరీక్షలు రాయనున్నారు.

● జిల్లా వ్యాప్తంగా 23 పరీక్ష కేంద్రాలు

ఇంటర్మీడియట్ పరీక్షలకు సంబంధించి జిల్లావ్యాప్తంగా 23 పరీక్ష కేంద్రాలను అధికారులు ఏర్పాటు చేశారు. ఇందులో 15 ప్రభుత్వ 8 ప్రైవేటు కళాశాలల్లో పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేశారు. పరీక్షల నిర్వహణకు 23 మంది పరీక్షల చీఫ్ సూపరింటెండెంట్‌లు, 23 మంది డిపార్ట్‌మెంటల్ అధికారులను నియమించారు. లోటుపాట్లకు తావుల లేకుండా సజావుగా నిర్వహించేందుకు గానూ అవసరమయ్యే స్క్వాడ్‌ల బృందాలను ఏర్పాటు చేశారు. డిప్యూటీ తహసీల్దార్, ఏఎస్‌ఐ కేడర్‌కు తగ్గ కుండా ఒక పోలీసు అధికారి, మరో జూనియర్ అధ్యాపకుడితో పాటు ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాన్ని ఏర్పాటు చేశారు. ఇద్దరు చొప్పున ఉండే మరో రెండు సిట్టింగ్ స్క్వాడ్ బృందా లను ఏర్పాటు చేశారు. పరీక్షల నిర్వహణకు గాను 705 మంది ఇన్విజి లేటర్లను నియమించారు. దీనికి అవసరమయ్యే కస్టోడియన్‌లను నియ మించారు. కస్టోడియన్‌ల సమక్షంలోనే పరీక్షల నిర్వాహకులు ప్రశ్న పత్రాలను విడుదల చేయడం, జవాబు పత్రాలను సమీప పోస్టాఫీస్ కార్యాయాల్లో డిపాజిట్ చేయడం వంటి కార్యక్రమాలు చేపట్టనున్నారు.

● ఏర్పాట్లు పూర్తి..

జిల్లాలో ఇంటర్మీడియట్ వార్షిక పరీక్షలను సజావుగా నిర్వహించేందుకు గానూ ప్రణాళికబద్ధమైన చర్యలు తీసుకున్నాం. పరీక్షల నిర్వహణకు అవసరమయ్యే అధికారులు, సిబ్బంది, మౌలిక వసతుల కల్పన తదితర వాటిని సమకూర్చాం. పరీక్షలను పకడ్బందీగా నిర్వహించేందుకు అన్నిచర్యలు తీసుకున్నాం. పరీక్షల నిర్వహణ వ్యవస్థలో ఎలాంటి పొరపాట్లు జరిగిన నిర్వాహణ అధికారులే బాధ్యత వహించాల్సి ఉంటుంది. ఒక్క నిమిషం ఆలస్యమైనా పరీక్ష కేంద్రాల్లోకి అనుమతించబోము.

(జాదవ్ పరుశురామ్, నోడల్ అధికారి నిర్మల్).

సంచార ముస్లిం తెగల సంఘ కార్యవర్గం

నిర్మల్ కల్చరల్, ఫిబ్రవరి 26 : జిల్లా సంచార ముస్లిం తెగల సంఘ కార్యవర్గాన్ని సోమవారం ఏర్పాటు చేశారు. రాష్ట్ర అధ్యక్షుడు సైదా ఖాన్ ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో అధ్యక్షుడిగా షైక్ అస్లాం, ఉపాధ్యక్షుడిగా మహమ్మద్ మాజీద్, సయ్యద్ బాబుమియ్యా, షాదుల్లా ఎన్నికకాగా కార్యదర్శిగా సయ్యద్ దస్తగిరి, కోశాధికారిగా షైక్ మసూద్, ఇతర కార్యవర్గ సభ్యులు ఎన్నికయ్యారు.

అభివృద్ధి పనులు చురుగ్గా కొనసాగాలి

లక్ష్మణచాంద, ఫిబ్రవరి 26 : అభివృద్ధి పనులు చురుగ్గా కొనసాగాలని జడ్పీటీసీ ఓస రాజేశ్వర్ సోమవారం అన్నారు. మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద మండలానికి 2 కోట్ల నిధులు మంజూరైనట్లు తెలిపారు. అధికారులు సమన్వయంతో పని చేసి అభివృద్ధి పనులు త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. ప్రతి గ్రామంలో సీసీ రోడ్డులు, డ్రైనేజీల నిర్మాణం చేపట్టాలని సూచించారు. రాజకీయాలకు అతీతంగా ప్రతి ఒక్కరూ తమ గ్రామాల అభివృద్ధికి సహకరించుకోవాలని కోరారు.

అమ్మవారిని సన్నిధిలో
సుప్రీంకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి



అమ్మవారి ఆలయంలో మనుమడికి అక్షరశ్రీకారం చేయిస్తున్న సుప్రీంకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి ఎన్వీ రమణ

బాసర, ఫిబ్రవరి 26 : బాసర సరస్వతీ అమ్మవారి ఆలయాన్ని సోమవారం సుప్రీంకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి ఎన్వీ రమణ సందర్శించారు. కుటుంబ సభ్యులతో ఆలయానికి చేరుకున్న ఆయనకు ఆలయ పండితులు వేద మంత్రాలతో స్వాగతం పలికారు. అమ్మవారిని దర్శించుకుని వారు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎన్వీ రమణ తన మనువడు విరాట్‌కు అమ్మవారి సన్నిధిలో అక్షర శ్రీకార పూజలు జరిపించారు.

నాయుడివాడలో అమ్మవారి విగ్రహపునః ప్రతిష్ఠాపనోత్సవం



నిర్మల్ కల్చరల్, ఫిబ్రవరి 26 : జిల్లా కేంద్రంలోని నాయుడివాడలో నిర్మించిన నూతన ఆలయంలో సోమవారం మారెమ్మ విగ్రహాన్ని పునః ప్రతిష్ఠించారు. అమ్మవారితో పాటు పోచమ్మతల్లి, పోతరాజుల విగ్రహాలను ప్రతిష్ఠించారు. ఈ మహోత్సవంలో మున్సిపల్ చైర్మన్ ఈశ్వర్, కౌన్సిలర్ సాదం స్వప్న అరవింద్, అయ్యన్నగారి భూమయ్య, ముడుసు ప్రవళిక, సత్యనారాయణ, డాక్టర్ సురేష్, తదితరులు పాల్గొన్నారు.

పెంచికల్‌పాడ్ గ్రామంలో
యంత్ర విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవాలు

కుంటాల, ఫిబ్రవరి, 26 : మండలంలోని పెంచికల్‌పాడ్ గ్రామంలో శివ పంచాయతన మహాదేవస్వామి యంత్ర విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. ఉత్సవాలు 28వ తేదీ వరకు కొనసాగనున్నాయి. మొదటిరోజు విగ్రహాల ఊరేగింపు, గణపతి పూజ, పుణ్యాహవచనము, రక్షాబంధనము, ఆచార్యది రుత్విక్ వరణం, అంకురార్పణ, యాగశాల ప్రవేశం, అఖండ దీప స్థాపన, స్థాపిత దేవతా హవనము, హోమాలు, గ్రామస్తులచే నదీ జలాల ఊరేగింపు తదితర కార్యక్రమాలు నిర్వహించారు.

అరుణచలేశ్వరుని సన్నిధిలో
అలరించిన చిన్నారుల నృత్య ప్రదర్శనలు



అరుణాచలంలో నృత్య ప్రదర్శన

భైంసా, ఫిబ్రవరి 26 : రెవెన్యూ డివిజన్ కేంద్రమైన భైంసాలోని చిన్నారులు తమిళనాడు రాష్ట్రంలోని అరుణచలేశ్వరుని సన్నిధిలో నిర్వహించిన సాంస్కృతిక ప్రదర్శనలలో కూడి భక్తులను విశేషంగా ఆకట్టుకున్నారు. పౌర్ణమి మహోత్సవ వేడుకలలో భాగంగా సోమవారం భైంసాలోని శ్రీ నయనం నృత్య కళానిలయానికి చెందిన చిన్నారులు భరత్ ఆర్ట్స్ అకాడమి ఆధ్వర్యంలో అరుణచలేశ్వరుని సన్నిధిలో కూచిపూడి నృత్య ప్రదర్శనలు చేపట్టారు.

మారనున్న బాసర రైల్వేస్టేషన్ రూపురేఖలు

- అమృత్ భారతి స్టేషన్ స్కీంలో ఎంపిక
- రూ. 11.33 కోట్లతో వివిధ అభివృద్ధి పనులు
- దేశవ్యాప్తంగా ఈ స్కీం కింద ఎంపికైన స్టేషన్‌లలో పనులను ప్రారంభించిన ప్రధాని నరేంద్ర మోదీ



బాసర రైల్వేస్టేషన్‌లో జరిగిన కార్యక్రమంలో ఎంపీ సోయం బాపురావు, ఎమ్మెల్యే రామారావు పటేల్ తదితరులు

బాసర, ఫిబ్రవరి 26 : ఇప్పటికే అభివృద్ధి చెందిన బాసర రైల్వేస్టేషన్ మరింత రూపుదిద్దుకోనుంది. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన అమృత్ భారత్‌స్టేషన్ స్కీంలో బాసర రైల్వేస్టేషన్ ఎంపికైంది. రూ.11.33 కోట్లతో వివిధ అభివృద్ధి పనులు చేపట్టనున్నారు. బాసర స్టేషన్‌తో పాటు దేశవ్యాప్తంగా ఈ స్కీం కింద ఎంపికైన రైల్వే స్టేషన్‌లలో పనులను సోమవారం దేశ ప్రధానమంత్రి నరేంద్ర మోదీ వర్చువల్‌గా ప్రారంభించారు. ఈ సందర్భంగా బాసర రైల్వేస్టేషన్‌లో జరిగిన కార్యక్రమానికి ఎంపీ సోయం బాపురావు, ఎమ్మెల్యే రామారావు పటేల్ తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ బీజేపీ హయంలోనే రైల్వే అభివృద్ధి జరిగిందని, ఆధునీకరణ సంతరించుకుంటుందని ఆయన అన్నారు. ప్రజలకు సౌకర్యంగా కొత్త లైన్‌ల ఏర్పాటు, రైళ్లసంఖ్య పెంపు వంటి చర్యలు కేంద్ర ప్రభుత్వం చేపట్టినట్లు తెలిపారు. ఈ పథకం కింద బాసర రైల్వేస్టేషన్ ఎస్కలేటర్‌తో పాటు ఉద్యానవనం, స్టేషన్ అంతా సుందరీకరణ పనులు చేపట్టనున్నట్లు తెలిపారు.

వేగవంతంగా
కేసుల పరిష్కారానికి చర్యలు చేపట్టండి

● జిల్లా న్యాయాధికారి ఏ.కర్ణకుమార్



మాట్లాడుతున్న జిల్లా న్యాయాధికారి ఏ. కర్ణకుమార్

నిర్మల్ కల్చరల్, ఫిబ్రవరి 26 : భూ సంబంధిత, క్రిమినల్ కేసుల పరిష్కారానికి వేగవంతం చర్యలు చేపట్టాలని జిల్లా న్యాయాధికారి ఏ.కర్ణకుమార్ అన్నారు. సోమవారం జిల్లా కోర్టు కార్యాలయంలో జిల్లా సమన్వయ కమిటీ నిర్వహించారు. కలెక్టర్ ఆశిష్‌సంగ్వాన్ జడ్జితో కలిసి పాల్గొన్నారు. జైలులో ఉన్న ట్రయల్ ఖైదీలపై ఉన్న కేసులలో చార్జీషీట్లు దాఖలు చేయాలన్నారు. క్రిమినల్ కేసులపై సాక్షులు, నిందితులు, విచారణ అధికారులు కోర్టులకు హాజరుకావాలన్నారు. 2020కి ముందు కేసుల పురోగతి, పెండింగ్ కేసులు, గత సమావేశాల్లో తీసుకున్న నిర్ణయాలపై తదుపరి చర్యలపై చర్చించారు. కోర్టు భవనాలు, నిర్మల్‌లో న్యాయాధికారుల నివాస గృహాల నిర్మాణానికి అంచనాలు, ప్రతిపాదనలు అడిగి తెలుసుకున్నారు. బాసరలో జ్యుడీషియల్ గెస్ట్‌హౌస్ నిర్మాణం, జిల్లా కోర్టు భవన విద్యుదీకరణ పనులపై చర్చించారు. ఏఎస్పీ భైంసా కాంతిలాల్ పాటిల్, డీఎస్పీ గంగారెడ్డి, డీఆర్‌ఓ గంగయ్య, తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యలను క్షేత్రస్థాయిలో పరిశీలించి పరిష్కరించాలి : కలెక్టర్



కలెక్టర్‌కు సమస్యలపై అర్జీలు సమర్పిస్తున్న ప్రజలు



పోస్టర్ ఆవిష్కరిస్తున్న కలెక్టర్

నిర్మల్ కల్చరల్, ఫిబ్రవరి 26 : ప్రజావాణిలో ప్రజల నుంచి వచ్చే సమస్యలు క్షేత్రస్థాయిలో పరిశీలించి పరిష్కరించాలని కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ అధికారులను ఆదేశించారు. సోమవారం ప్రజావాణిలో భాగంగా పలు ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజల నుండి దరఖాస్తులు స్వీకరించారు. పెండింగ్ సమస్యలపై అధికారులతో చర్చించారు. వేసవిలో తాగునీటి సమస్య తలెత్తకుండా చర్యలు చేపట్టాలని సూచించారు. ఆస్తి పన్ను బకాయిలు వసూలు, ఇంటర్ పరీక్షల నిర్వహణ, తదితర అంశాలపై దిశానిర్దేశం చేశారు. వ్యవసాయ, ధరణి, పెన్షన్లు, భూ సంబంధిత పలు సమస్యలు పరిష్కరించాలని 39 దరఖాస్తులు అందినట్లు తెలిపారు. డీఆర్‌ఓ గంగయ్య, డీఆర్డీవో విజయలక్ష్మి, పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన కల్పించండి : కలెక్టర్

ఆర్థిక అక్షరాస్యతపై విద్యార్థుల్లో అవగాహన కల్పించాలని కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ అన్నారు. సోమవారం ఆర్‌బీఐ ఆధ్వర్యంలో నిర్వహించే ఆర్థిక అక్షరాస్యత వారోత్సవాల పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఈ నెల 26 నుండి 29 వరకు వారోత్సవాలు నిర్వహిస్తారని తెలిపారు. ప్రభుత్వ ఉన్నత పాఠశాలలు, కళాశాలల్లో ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. పొదుపు ప్రయోజనాలు, ఆర్థిక లాభాలు అర్థించడం, సైబర్ స్కామ్ తదితర అంశాలపై వివరించాలన్నారు. లీడ్ బ్యాంకు మేనేజర్ చంద్రశేఖర్, పలు బ్యాంకు మేనేజర్లు, అధికారులు పాల్గొన్నారు.

భైంసాలో ప్రజా ఫిర్యాదులకు స్పందన కరువు



భైంసాలో ప్రజా ఫిర్యాదుల విభాగంలో పాల్గొన్న వివిధ శాఖల అధికారులు

భైంసా, జనవరి 26 : ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం కోసం ప్రత్యేకంగా నిర్వహిస్తున్న ప్రజా ఫిర్యాదుల విభాగానికి భైంసాలో స్పందన కరువవుతుంది. ప్రతిసోమవారం తహసీల్దార్ కార్యాలయంలో ఫిర్యాదుల స్వీకరణ కోసం గాను ప్రభుత్వం కార్యక్రమాన్ని చేపడుతోంది. అయితే సంబంధిత కార్యక్రమానికి అధికారులు అధిక సంఖ్యలో హాజరవుతున్నప్పటికీ దరఖాస్తు చేసుకునే వారు కరువవుతున్నారు. సోమవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో నిర్వహించిన ఫిర్యాదుల విభాగానికి తహసీల్దార్ ప్రవీణ్ తో పాటు వివిధ శాఖలకు చెందిన 14 మంది అధికారులు హాజరయ్యారు. అయితే ఒక్కరు కూడా సంబంధిత విభాగానికి దరఖాస్తు చేసుకునేందుకు రాలేదు. అసెంబ్లీ ఎన్నికల ప్రక్రియ ముగిసిన తదుపరి ఇప్పటి వరకు 10 వారాలుగా ప్రజా ఫిర్యాదుల విభాగం నిర్వహించినప్పటికీ ఒక్క దరఖాస్తు కూడా రాలేదని అధికారులు తెలిపారు.

'మెప్మా డీఎంసీపై చర్య తీసుకోవాలి'



ఫిర్యాదు చేస్తున్న చైర్మన్, కౌన్సిలర్లు

కమిషనర్‌కు మున్సిపల్ చైర్మన్ ఫిర్యాదు

నిర్మల్ కల్చరల్, ఫిబ్రవరి 26 : నిర్మల్ మెప్మా కార్యాలయంలో డీఎంసీగా విధులు నిర్వహిస్తున్న డిసుభాష్‌పై గతంలో అవినీతి ఆరోపణలు చేసినా చర్య తీసుకోలేదని వెంటనే క్రమశిక్షణ చర్యలు చేపట్టాలని సోమవారం మున్సిపల్ చైర్మన్ ఈశ్వర్, కౌన్సిలర్లు కమిషనర్‌కు లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేశారు. సిటీలెవెల్ ఫెడ్ సెంటర్‌కు మంజూరైన రూ.40 లక్షల నిధులు దుర్వినియోగం చేశారని ఆరోపించారు. రూ.5 లక్షల మేర బినామీ పేర బ్యాంకు ఖాతాలో జమ చేయించుకున్నారని తెలిపారు. గతంలో ఆదిలాబాద్ మెప్మా కార్యాలయంలోనూ అవినీతి ఆరోపణలు ఎదుర్కొన్నారని వివరించారు. బతుకమ్మ సంబరాలు, మహిళా దినోత్సవం, తదితర వాటిలో పెద్ద ఎత్తున అక్రమాలకు పాల్పడ్డారని స్పష్టం చేశారు. మున్సిపాలిటీ కాంట్రాక్టులు చేయడం, నిధుల దుర్వినియోగంపై సమగ్ర విచారణ జరిపి చర్యలు చేపట్టాలని కోరారు. ఉన్నతాధికారులకు ఫిర్యాదు ప్రతులను పంపించారు.

సీసీ రోడ్ల నిర్మాణానికి భూమి పూజ

లక్ష్మణచాంద, ఫిబ్రవరి 26 : మండల కేంద్రంలో రూ. 7 లక్షల ఈజీఎస్ నిధులతో సీసీ రోడ్డు నిర్మాణానికి కాంగ్రెస్ నాయకులు సోమవారం భూమి పూజ చేశారు. డీసీసీ అధ్యక్షులు కూచాడి శ్రీహరి రావు కృషితో ఈ నిర్మాణాన్ని పూర్తి చేయనున్నామని వారు తెలిపారు. మండల కేంద్రానికి మొత్తం రూ. 20 లక్షల నిధులు సీసీ రోడ్లకు మంజూరు అయ్యాయని, విడతల వారీగా ఈ నిర్మాణం పూర్తి చేస్తామని వారు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు ఒడ్నాల రాజేశ్వర్, సీనియర్ నాయకులు అట్ల రామ్‌రెడ్డి, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

అంబకంటిలో ఒకరి ఆత్మహత్య

కుంటాల, ఫిబ్రవరి, 26 : మండలంలోని అంబకంటి గ్రామానికి చెందిన పొన్నవేని చందు (31) అనే యువకుడు ఆదివారం రాత్రి ఇంట్లో ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డట్లు ఏఎస్‌ఐ దేవరావు తెలిపారు. కుటుంబీకులు, పోలీసుల కథనం మేరకు చందు భార్య గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడు తుండడంతో అప్పు చేసి ఆమెకు ఆపరేషన్ చేయించాడు. అయితే అప్పు ఎలా తీర్చాలని జీవితంపై విరక్తితో జోర్ కర్రెనెతో దూలానికి ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడని తెలిపారు. భార్య పిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్‌ఐ తెలిపారు.

కుంటాల ఎస్ఐగా రజనీకాంత్



బాధ్యతలు స్వీకరిస్తున్న రజనీకాంత్

కుంటాల, ఫిబ్రవరి, 26: కుంటాల నూతన ఎస్ఐగా రజనీకాంత్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పనిచేసిన హన్మండ్లు బదిలీపై పెంబి వెళ్లగా పెంబిలో ఎస్ఐగా విధులు నిర్వహిస్తున్న రజనీకాంత్ కుంటాలకు బదిలీపై వచ్చారు.

విద్యార్థులను అభినందించిన యాజమాన్యం



నిర్మల్ కల్చరల్, ఫిబ్రవరి 25 : శ్రీనివాస రామానుజన్ ఫౌండేషన్ హైదరాబాద్ వారు ఇటీవల నిర్వహించిన ఒలంపియా అండ్ సైన్స్ ఒలంపియాడ్ పరీక్షల్లో విజయం సాధించిన విద్యార్థులను విజయ హైస్కూల్ యాజమాన్యం సోమవారం అభినందించింది. జిల్లా స్థాయి ర్యాంకులు సాధించిన వారిని అభినందించారు. చైర్మన్ నల్ల ఇంద్రకరణ్‌రెడ్డి, జిల్లా ఒలంపియాడ్ చైర్మన్ అయ్యన్నగారి భూమయ్య, అంబారాజీ, మంచిర్యాల నాగభూషణం, ఆడెపు సుధాకర్, ప్రిన్సిపాల్ మోహన్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.